సకుటుంబ సహపంక్తి భోజనాలు



సకుటుంబ సహపంక్తి భోజనాలు చేస్తున్న ఉపాధ్యాయులు

కీసర: రాంపల్లిలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో ఉపాధ్యాయులు, సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులందరికీ మంగళవారం వార్షిక సహపంక్తి భోజనాలు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జూబ్లీ హిల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు మురళీ ముకుంద్, పాఠశాల ప్రిన్సిపాల్, సంతోష్‌కుమార్, అడ్మినిస్ట్రేషన్ కె.సుశీల హాజరయ్యారు. అనంతరం ఉపాధ్యాయులు ఆట, పాటలు, ప్రదర్శనలతో సందడి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

మేడ్చల్: మండలంలోని మైసిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మహేంద్రచారి మరణించడంతో ఎమ్మెల్యే మల్లారెడ్డి మంగళవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం నూతన్‌కల్‌లో మరో కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు భాస్కర్‌యాదవ్, దయానంద్ యాదవ్, రాజమల్లారెడ్డి, సుదర్శన్, తదితరులు ఉన్నారు.

కీసరగుట్టలో కాంగ్రెస్ నేతల పూజలు



కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి సన్నిధిలో ఉదయ్ భాను తదితరులు

కీసర: కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామిని యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిరి శివచరణ్‌రెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారిని సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పాన్నం తరుణ్‌గౌడ్, కీసర గ్రామ మాజీ ఉపసర్పంచ్ తటకం లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతి, కీసర మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వినోద్, మేడ్చల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వెంకట్‌చారి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మేడ్చల్: మేడ్చల్ నియోజకవర్గ పరిధిలో లబ్ధిదారులకు మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మంగళవారం తన నివాసంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మణ్‌కు , రాజబొల్లారం తండాకు చెందిన సక్కుబాయికి రూ.50వేల చొప్పున ఆర్థిక సహాయం మంజూరు కావడంతో ఆయా చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భాస్కర్‌యాదవ్, సుదర్శన్, దయానంద్, రవి కుమార్, ఈశ్వరయ్య, నవీన్‌రెడ్డి, రవి, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



వినయ్ (ఫైల్)

ఘట్‌కేసర్: పనికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఘట్‌కేసర్‌కు చెందిన ఉడతల వినయ్ (22) చర్లపల్లిలోని ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. సోమవారం కంపెనీకి వెళ్లిన అతను డ్యూటీతో పాటు ఓటీ చేశాడు. మంగళవారం వస్తానని చెప్పిన వినయ్ ఇంటికి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ అయినట్లు తెలిసింది. అతడి కోసం గాలించినా ఆచూకీ లభించకపోవడంతో అతని తండ్రి యాదగిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తొలిరోజు ప్రశాంతంగా ఎప్‌సెట్ పరీక్ష

మల్కాజిగిరి: ఎప్‌సెట్ పరీక్ష మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అయాన్ డిజిటల్ జోన్ ఆన్‌లైన్ పరీక్ష కేంద్రంలో తొలిరోజు ప్రశాంతంగా జరిగింది. మంగళ, బుధవారాల్లో అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో పరీక్షలు జరగనుండగా శుక్ర, శని, ఆదివారాల్లో ఇంజినీరింగ్ విభాగం పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షా కేంద్రానికి గంట ముందుగానే విద్యార్థులు చేరుకున్నారు. మొత్తం 1970 మంది విద్యార్థులకు 1826 మంది విద్యార్థులు హాజరయ్యారు.

వేసవి సెలవులు...
నైపుణ్యానికి మెరుగులు

తెలంగాణ లలిత కళల పాఠశాలలో వేసవి శిబిరం

- పెయిటింగ్, డ్రాయింగ్, హ్యాండ్ రైటింగ్ తదితర అంశాల్లో శిక్షణ
- సమయాన్ని సద్వినియోగం చేసుకుంటున్న విద్యార్థులు



బంజారా ఎంబ్రాయిడరీ నేర్చుకుంటున్న విద్యార్థినులు

ఘట్‌కేసర్: వేసవి సెలవులు అనగానే విద్యార్థులను అమ్మమ్మ, బంధువుల ఇళ్లు, విహారయాత్రలు పంపిస్తుంటారు. నేటి పోటీ ప్రపంచంలో అందరిలో ముందుంటేనే గుర్తింపు ఉంటుంది. వేసవి సెలవుల్లో విద్యార్థులు అదనపు నైపుణ్యం సంపాదించడంపై దృష్టి సారిస్తే జీవితంలో రాణించవచ్చు. తద్వారా శారీరక, మానసిక వికాసం పెంపొందుతుంది. మెదడు చురుగ్గా పనిచేస్తుంది. అందుకే వేసవి సెలవులు వృథా చేయకుండా పిల్లలకు ఏదో ఒకటి నేర్పించాలని తల్లితండ్రులు భావిస్తున్నారు. ఫీజులు చెల్లించి మరీ వారి ప్రతిభకు సానబెడుతు పిల్లల అభిరుచులకు అనుగుణంగా పలు అంశాల్లో శిక్షణ పొందుతున్నారు. ఆర్థిక స్థోమత ఉన్న వారు ఫీజులు చెల్లించి శిక్షణ పొందుతుండగా పేద పిల్లలకు ఆ అవకాశం లభించడం లేదు. ఈ నేపథ్యంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల విద్యార్థుల కోసం నూతనంగా వేసవి శిబిరం నిర్వహిస్తున్నామని, శిక్షణ అనంతరం విద్యార్థులకు సర్టిఫికేట్లు అందజేస్తామని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రాము, వైస్ ప్రిన్సిపాల్ రాములు తెలిపారు.

ప్రతిభకు సాన...

పేద విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల విద్యా సంస్థల కార్యదర్శి అలుగు వర్షిని నూతన వరవడికి శ్రీకారం చుట్టారు. విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యం వెలికి తీసేందుకు ఉచిత వసతి, భోజన సౌకర్యంతో పాటు సుశిక్షితులైన ఉపాధ్యాయులతో శిక్షణ ఇప్పిస్తున్నారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎదులాబాద్ లలిత కళల పాఠశాలలో రాష్ట్రంలోని ఒక్కో గురుకులం నుంచి ప్రతిభగల ఐదుగురి చొప్పున సుమారు 1200 మంది విద్యార్థులకు వేసవి శిబిరం నిర్వహిస్తున్నారు. అందులో పెయింటింగ్, డ్రాయింగ్, మట్టితో బొమ్మలు, కార్టున్, ఫొటోగ్రఫీ, నకాసీ పెయింటింగ్, అల్లికలు, జర్నలిజం వేద గణితం, చేతిరాత, బంజారా ఎంబ్రాయిడరీ అంశాల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. దీంతో విద్యార్థులు అదనపు నైపుణ్యం పెంపొందించుకునే అవకాశం లభిస్తుంది. విద్యార్థులు ఉత్సాహంగా శిక్షణలో పాల్గొంటున్నారు.



డ్రాయింగ్ బొమ్మలను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు





పెయింటింగ్ వేస్తున్న విద్యార్థినులు

సమయం వృథా చేయకూడదని...



వేసవి సెలవుల్లో సమయం వృథా చేయకూడదని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల ప్రోద్బలంతో వేసవి శిబిరానికి వచ్చాను. బంజారా ఎంబ్రాయిడరీలో శిక్షణ పొందుతున్నా. అందరితో కలిసి నేర్చుకోవడం సంతోషంగా ఉంది.

– రిషిత, సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల ఆలేరు

నైపుణ్యం పెంచుకునే అవకాశం...



వేసవి శిబిరంలో అరుదైన కళ నకాసీ పెయింటింగ్, వేదిక్ మ్యాథ్స్‌లో శిక్షణ పొందుతున్నాను. వ్యక్తిగత నైపుణ్యం పెంపొందించుకునే అవకాశం లభించింది. జీవితంలో మరిచిపోలేని శిబిరం. వేసవి శిక్షణ శిబిరం నిర్వాహణ చాలా బాగుంది.

–లోహిత, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, ఆలేరు

ప్రతిభను వెలికి తీయాలని...



తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల విద్యార్థుల ప్రతిభకు సానబెట్టడానికి వేసవి శిబిరం నిర్వహిస్తున్నాం. జీవితంలో విద్యార్థులు రాణించడానికి శిబిరం తోడ్పడుతుంది. సెలవులు సద్వినియోగం చేసుకునే వారికి బంగారు అవకాశం.

– వింధ్యారాణి, జోనల్ ఆఫీసర్

ఆర్టీసీ అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం



ప్రశంసాపత్రాలను అందజేసిన డీఎం కవిత

బోడుప్పల్: ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి ప్రతి ఉద్యోగి సమష్టిగా కృషి చేద్దామని చెంగిచర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ కవిత అన్నారు. చెంగిచర్ల ఆర్టీసీ డిపోలో మంగళవారం ప్రగతిచక్రం త్రైమాసిక పురస్కారాల్లో భాగంగా అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఉత్తమ ఉద్యోగులకు ఆమె నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఉద్యోగి అంకితభావంతో పనిచేసినప్పుడే ఆదాయం సమకూరుతుందన్నారు. డ్రైవర్లు ఏకాగ్రతతో బస్సులు నడిపి రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు కృషి చేయాలన్నారు. సమయపాలన పాటించి ప్రయాణికుల మన్ననలు పొందాలన్నారు. అసిస్టెంట్ మేనేజర్లు చంద్రమౌళి, శేషిరెడ్డి, ఈడబ్ల్యూబీ సభ్యులు పద్మావతి, వెంకటేష్ పాల్గొన్నారు.

క్యాప్ జెమినీతో సీఎంఆర్‌సెట్ ఎంఓయూ



ఒప్పంద పత్రాలతో సీఎంఆర్‌సెట్-క్యాప్ జెమినీ ప్రతినిధులు

మేడ్చల్‌రూరల్: కండ్లకోయలోని సీఎంఆర్ సెట్ కళాశాల క్యాప్ జెమినీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు మంగళవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గోపాల్‌రెడ్డి, క్యాప్ జెమినీ ప్రతినిధులు ఎంఓయూపై సంతకాలు చేసి ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. క్లౌడ్ కంప్యూటింగ్, అజూర్‌లో పరిశ్రమ ఆధారిత శిక్షణ కోసం ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రాజగోపాలన్, అమర్‌జీత్, ప్రియాంక ప్రసాద్, సౌరవ్ నారాయణ్ బిశ్వాస్, సీఎంఆర్ గ్రూప్స్ సీఈఓ అభినవ్‌రెడ్డి, డైరెక్టర్ నారాయణ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ హిమబిందు,తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం



ఏఎస్‌రెడ్డినగర్‌లో బాక్స్‌డ్రెయిన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీదేవి

కుషాయిగూడ: చాలా ఏళ్లుగా ఉన్న మురుగు సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. మంగళవారం ఆమె కాలనీలో చేపట్టిన బాక్స్‌డ్రైన్ పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్టామ్‌వాటర్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయని, బాక్స్‌డ్రెయిన్ పనులు పూర్తైతే వరద, మురుగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి, ఏఈ స్వరూప, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, డివిజన్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి, కనకరాజుగౌడ్, రాంచంద్రయ్య, వాసుదేవరెడ్డి, రంగారెడ్డి, వీరన్న, నగేష్, రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మణ్‌చారి, తిరుపతయ్య తదితరులున్నారు.

పహల్గాం మృతులకు నివాళి



మల్లాపూర్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

మల్లాపూర్: పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మృతిచెందిన పర్యాటకులకు బీజేపీనేత ఎనుముల మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో మల్లాపూర్ ఎలిఫెంట్ చౌరస్తా నుంచి మల్లాపూర్ శివహోటల్ చౌరస్తా వరకు కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టి నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని 2 నిమిషాల పాటు మౌనం పాటించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, శైలేష్‌రెడ్డి, కృష్ణయాదవ్, ఆంజనేయులు, ధర్మారెడ్డి, మల్కయ్య, యాదిగిరిగౌడ్, రవీందర్‌సాగర్, శ్రీనివాస్‌రెడ్డి, సాంబశివరావు, శ్రీకాంత్‌రెడ్డి, మర్రి మోహన్‌రెడ్డి, శ్రీను, రవీందర్ యాదవ్, ఆనంద్, నిర్మల, శ్యామల, సవిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ తల్లి కల్యాణం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ మేయర్ కావ్య

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ మేయర్ మేకల కావ్య హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాలాజీ నగర్ రేణుక ఎల్లమ్మ తల్లికి గొప్ప చరిత్ర ఉందని, ప్రజలంతా అమ్మవారి ఆశీస్సులతో చల్లగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జిట్టా శ్రీవాణి శ్రీనివాస్‌రెడ్డి, లావణ్య సతీష్‌గౌడ్, సంగీత రాజశేఖర్, పార్టీ అధ్యక్షులు కొండల్ ముదిరాజ్, గౌడ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వెండి తోరణాల బహూకరణ



వెండి తోరణాలను సమర్పిస్తున్న మధుసూదన్‌రెడ్డి

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీవేంకటేశ్వర దేవస్థానంలోని మూలవిరాట్‌కు చక్రిపురం రెడ్డి కాలనీకి చెందిన మధుసూదన్‌రెడ్డి, సాహితిరెడ్డిలు సుమారు కిలో వెండితో తయారు చేయించిన తోరణాలను కానుకగా అందజేశారని, ఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి అలంకరించారు.ఆలయం దాత కుటుంబసభ్యులను సన్మానించి శేషవస్త్రాలను అందజేశారు.

గొర్రెల పెంపకం దారుల సమస్యలు పరిష్కరించాలి

మేడ్చల్: గొర్రెలు, మేకల పెంపకం దారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జిల్లా గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు కుమార్, కోమురయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మేడ్చల్‌లో నిర్వహించిన సంఘం రెండో మహాసభలో వారు మాట్లాడుతూ జీవాల పెంపకం దారులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రధానంగా జీవాలను మేపడానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారని, గొర్రెలకు బీమా సౌకర్యం కల్పించాలని, సబ్సిడీపై దాణా సరఫరా చేయాలని, మూడు నెలలకోసారి నట్టల నివారణ మందులు వేయాలని, పశు వైద్యశాలలో వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉంచాలని, 50 ఏళ్లు దాటిన పెంపకం దారులకు రూ.5వేల చొప్పున పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నూతన కమిటీ ఎన్నిక. అనంతరం మండల గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా పెద్ద కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా శ్రీశైలం,గౌరవ అధ్యక్షుడిగా వెంకటేశం తదితర కార్యవర్గంను ఎన్నుకున్నారు.

క్షేత్ర స్థాయి విచారణ వేగవంతం చేయాలి

మేడ్చల్: జిల్లాలో ఇందిరమ్మ లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణ ప్రక్రియకు సంబంధించి మే 1 లోగా అధికారులు క్షేత్ర స్థాయి విచారణ పూర్తి చేయాలని జిల్లా స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్తా ఆదేశించారు. మంగళవారం ఆమె మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని మేడ్చల్ 19వ వార్డు, గిర్మాపూర్ పరిధిలోని 9 వ వార్డులో మున్సిపల్ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తు దారుల పూర్తి వివరాలు సేకరించి తుది జాబితా రూపొందించాలన్నారు. ఎలాంటి పొరపాట్లు చేయకుండా అర్హులకు ఇళ్లు అందేలా చూడాలన్నారు. అడిషనల్ కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, మున్సిపల్ ఇందిరమ్మ ఇళ్ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యాన్ల తయారీ కంపెనీలో అగ్ని ప్రమాదం

మేడ్చల్‌రూరల్: ఫ్యాన్ల తయారీ కంపెనీలో అగ్ని ప్రమాదం జరిగిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని బాసరేగడి పరిధిలో ఉన్న ఫ్యాన్లను తయారు చేసే కేకేజీ ఎలక్ట్రికల్స్ కంపెనీలో సోమవారం అర్ధరాత్రి తర్వాత అగ్ని ప్రమాదం జరిగింది. ఉవ్వెత్తున్న మంటలు చెలరేగాయి. భారీ ఎత్తున పొగ కమ్ముకుంది. దీనిని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. కంపెనీలో సరైన రక్షణ సౌకర్యాలు లేని కారణంగానే ఈ ప్ర మాదం జరిగినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు తె లిపారు. కొత్త నిబంధనల ప్రకారం భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ మేరకు మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి...



దేవానాయక్ (ఫైల్)

శామీర్‌పేట్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మూడుచింతలపల్లి మండలం, లక్ష్మాపూర్ తాండాకు చెందిన ధారావత్ దేవానాయక్(35) మమతలకు ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు ఉన్నాడు. దేవానాయక్ ప్లంబర్ పనిచేస్తుండగా, మమత రోజూవారి కూలీ పనికి వెళ్లేది. సోమవారం పనికోసం బయటికి వెళ్లిన దేవానాయక్ అదేరోజు రాత్రి లక్ష్మాపూర్ తాండాలోని అంగన్‌వాడీ సమీపంలో రోడ్డుపై గాయాలతో పడి ఉన్నాడు. దీనిని గుర్తించిన స్థానికులు అతడిని గాంధీ అసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

దాడి చేసి హత్యచేశారు: మృతుడి బంధువుల ఆరోపణ

దేవాను కొట్టి చంపారని అతడి బంధువులు ఆరోపిస్తున్నారు. దేవ భార్య మమత అదే తండాకు చెందిన వ్యక్తి వద్ద కూలీగా పని చేస్తోందని, వారం రోజులుగా అతడి వద్దనే ఉండటంతో దేవా భార్యతో గొడవ పడ్డాడు. దీంతో ఆమె ప్రియుడితో కలిసి దేవాను హత్య చేసిందని బంధువులు ఆరోపిస్తున్నారు. శామీర్‌పేట పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గందరగోళంగా ఎల్‌ఆర్ఎస్

- ఫీజు చెల్లించేందుకు తప్పని అవస్థలు
- అర్జీలకు కొర్రీలు..పరిష్కారానికి ఆఫీస్‌ల చుట్టూ ప్రదక్షిణలు
- నేటితో ముగియనున్న 25 శాతం రాయితీ ఫీజు చెల్లింపు గడువు
- మేడ్చల్ జిల్లాలో ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తులు 1.65 లక్షలు
- పరిష్కరించినవి 1.15 లక్షలు

జిల్లాలో ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తుల వివరాలు ఇలా

పురపాలక సంఘం	మొత్తం దరఖాస్తులు	పరిష్కారమైనవి
నిజాంపేట	4,269	2,570
బోడుప్పల్	17,826	8,896
పీర్జాదిగూడ	9,689	5,028
జవహర్‌నగర్	293	154
ఘట్కేసర్	30,520	21,837
నాగారం	18,923	15,905
దమ్మాయిగూడ	21,992	15,037
పోచారం	22,655	16,408
దుండిగల్	15,156	11902
తూముకుంట	9,151	7,410
గుండ్లపోచంపల్లి	2,501	2,096
కొంపల్లి	2,091	1,431
మేడ్చల్	9,946	6,745
మొత్తం	1,65,012	1,15,419

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని నాలుగు నగర పాలక సంస్థలు, తొమ్మిది మున్సిపాలిటీలు, 34 పంచాయతీల పరిధిలో ఖాళీ స్థలాలను క్రమబద్ధీకరించుకునేందుకు దరఖాస్తు చేసుకున్న స్థల యజమానులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఆదాయం రాబట్టుకునేందుకు ప్రభుత్వం 25 శాతం రాయితీ అవకాశం ఇవ్వగా... ఆ గడువు ఈ నెల 30(బుధవారం)తో ముగుస్తోంది. రాయితీ గడువు మళ్లీ పెంచబోరని అధికార వర్గాల పేర్కొంటుండటంతో... ఆసక్తిగల దరఖాస్తుదారులు ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా... అర్జీలు మాత్రం పూర్తి స్థాయి పరిష్కారానికి నోచుకోవటం లేదు.

దరఖాస్తులకు కొర్రీలు..

లేఅవుట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తుదారులు రూ.25 వేల నుంచి రూ. లక్షల్లో ఫీజు చెల్లించాల్సివస్తోంది. ఈ మొత్తాన్ని చెల్లించేందుకు దరఖాస్తుదారులు ముందుకు వస్తున్నా అర్జీలకు సంబంధిత శాఖలు రకరకాల కొర్రీలు వేస్తుండటంతో వారు నానా అవస్థలు పడుతున్నారు. పైగా అభ్యంతరాలను పరిష్కరించుకునేందుకు కొందరు రిజిస్ట్రేషన్, ఇరిగేషన్, రెవెన్యూ, పురపాలక సంఘాల ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది.

సమస్యలు ఇవీ..

ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తుదారులు అన్ని పత్రాల(సర్టిఫికెట్ల)తో వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాత ఎల్–1 అధికారికి వెళ్తున్నాయి. అక్కడ క్షేత్రస్థాయి పరిశీలన, పత్రాలు అప్‌లోడ్ చేసిన తర్వాత ఎల్–2కి వెళతాయి.ఎల్–2లో ఫీజు మదింపు జరగాల్సి ఉండగా..వారి లాగిన్‌లో మళ్లీ ఎల్–1 పెండింగ్ అని చూపుతున్నాయని దరఖాస్తు దారులు పేర్కొంటున్నారు. అన్నీ సక్రమంగా ఉన్న దరఖాస్తులకు ఫీజు చెల్లించిన వారిలో కూడా కొందరికి పెండింగ్ సూచిస్తోందంటున్నారు. ఫీజు చెల్లించిన తర్వాత ఇరిగేషన్, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ నుంచి పత్రాలు(సర్టిఫికెట్లు) తీసుకొచ్చి అప్ లోడ్ చేయాలంటోంది. ప్రక్రియలన్నీ పూర్తయితే మళ్లీ ఎల్–1 పెండింగ్ వస్తోంది. ఫీజు కట్టిన దరఖాస్తులు వెబ్‌సైట్‌లో కనిపించడం లేదు. అవి ఎక్కడ ఉన్నాయనే విషయం కూడా దరఖాస్తుదారుడికి, లాగిన్ అధికారికి తెలియడం లేదని పేర్కొంటున్నారు. పలు పురపాలక సంఘాల పరిధిలో వందలాది దరఖాస్తుదారులకు ఫీజు చెల్లించేందుకు సమాచారం ఇచ్చారు. వీరంతా చెల్లించడానికి వస్తే రకరకాల సమస్యలు ఎదురవుతున్నాయి. ఆయ సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయన్నది ప్రశ్నార్థకంగా మారుతోంది. సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో ముందుకు సాగితే తప్ప ..పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తులకు మోక్షం లభించటంతో పాటు సర్కారు లక్ష్యానికి అనుగుణంగా ఆదాయం రాగలదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

